విద్యార్థి సంఘాలను గుప్పెట్లో పెట్టుకున్న రాజకీయపార్టీల వజ్రాయుధం?

యస్.ఆర్ ఖాశింపీరా కధ

# భారత్ బంద్

"మావా...!"


"........"

"మావా...." నులక మంచంమీద పడుకొని గురకపెట్టి నిద్రపోతున్న ఓబులేసును బలవంతాన తట్టి లేపింది ఈరమ్మ. అంతక్రితమే కూలి పని ముగించుకుని ఇంటికొచ్చాడు ఓబులేసు. వచ్చీరాగానే చెమటలు పడ్డ శరీరానికి కాసిన్ని గోరువెచ్చని నీటితో శుభ్రంచేసి కాసింత విశ్రాంతి కోసం కునుకు తీస్తున్నాడు. అందువల్ల కాబోలు... భార్య కుదుపునకు కళ్ళు తెరవకుండానే మండిపడ్డాడు ఓబులేసు.

"ఏంటే నీగోల...?"

"పెద్దోళ్ళు వస్తున్నారు... కాస్త మంచం దిగు..." భర్త కోపాన్ని గమనించి నసుగుతూ చెప్పింది ఈరమ్మ. నిద్రమత్తులో ఉన్న ఓబులేసుకు భార్య మాటలు అంతగా రుచించలేదు.

"రానివ్వే... ఎవడొస్తే నాకేంటి...?". అందుకే పెదవి విరుపుగా ఒకమాట చెప్పేసి తిరిగి నిద్రలోకి జారుకున్నాడు ఓబులేసు. నిద్రమత్తులో ఉన్న ఓబులేసు మనసు మాట జారినట్టుగా అనిపించింది ఈరమ్మకు. ఒక్కసారిగా ఆమెలో చిన్నగా భయం అనే భూతం ఆవరించసాగింది. ఇంతలో పదిమంది పెద్ద మనుషులు అక్కడికి చేరుకున్నారు. ముక్కుపుటాలు అదిరే మురికిపేట అది. ఖరీదైన వస్తువులు లేని పూరిళ్ళు అక్కడ ఉండేవి. అవి మంచి మమతకు పుట్టినిళ్ళు. నీతి నిజాయితీకి మెట్టినిల్లు. మారుతున్న కాలానికి అనుగుణంగా మనుషుల వేషభాషలు మారుతున్నా



మనిషిలోని కల్మషం మాత్రం మారడంలేదు. కాసింతైనా తగ్గడంలేదు. "ఏ చరిత్ర తిరగేసినా ఏముంది గర్వకారణం..." అన్న మహాపురుషుడి మాట అక్షరాలా సత్యమనేది నేటి అందరిమాట.

"ఓట్లు దగ్గరికి వచ్చేసరికి వీడికి వళ్లు బలిసినట్లుంది...." ఓబులేసు పడుకొని ఉన్న మంచంకేసి చూసిన ఒక పెద్దమనిషి

తన మాటల్లో నిప్పులు కురిపించాడు.

"కూటికి లేని దరి(ద్రపు వెధవ, వీడికింత పొగరా...?" ఇంకో పెద్ద మనిషి కూడా తన పెద్దరికం నిలుపుకున్నాడు.

"కులం తక్కువైనా... దర్జా మా(త్రం దండిగానే ఉంది". అందరూ నోటికి వచ్చిందల్లా వాగేస్తుండగా నేను మా(త్రం ఎందుకు నోరు మూసుకోవాలి అన్నట్టుగా మూడవ పెద్ద మనిషిగూడా తన కడుపుమంట మాటలద్వారా చల్లార్చుకున్నాడు. వీరి మాటలు ఈరమ్మ చెవికి చేరినా... ఎదిరించి మాట్లాడడానికి ధైర్యంలేక వినీ విననట్టే మిన్నకుండిపోయింది. ఆమెకు పేదరికం భయపెట్టిందేగాని... పెద్దరికంగాదు.

"చూడండి.... మనది (ప్రజాస్వామ్యదేశం. ఈ దేశంలో మనలాంటి పెద్దోళ్లకు ఎంత స్వేచ్ఛ ఉందో... ఇలాంటి పేదోళ్ళకు కూడా అంతే స్వేచ్ఛ ఉంది. (ప్రతి పేదవాడు రెండే రెండు సమస్యలతో సతమతమవుతూ ఉంటాడు. ఒకటి కడుపు మంటతో... రెండు ఆకలిమంటతో...! మనలాంటి వాళ్లు అవసర సమయాల్లో ఆకలిమంటను చల్లార్చాలి. కడుపుమంట పెదవి దాటి బయటకి రాకుండా ఆశలు రేకెత్తించాలి, పైగా మీకు ఇంకో విషయం తెలుసా?... వారు మనలాంటి వారిపైన కోపం (ప్రదర్శించేది ఇలాంటి సమయాల్లోనే నయ్యా. ఈ పదిరోజులు వారు చెప్పినట్లు మనం వినాలి. ఆ తరువాత ఐదేళ్ళవరకూ మనం చెప్పినట్లు వారు వినాలి. రాజకీయం అంటే ఇదేనయ్యా. ఇంకా తెలుసుకోలేకపోతే ఎలాగ? ఇలాంటి సమయాల్లో కడుపుకాలే కష్టజీవులు థూ అంటూ మన ముఖాల మీద ఉమ్మేసినా... తల దించుకోకుండా తుండుగుడ్డతో నవ్వుతూ తుడిచేసుకోవాలి.. .! అందుకే... ఎవరు ఎక్కడ అతిగా నోరు జారవద్దు" వారి నాయకుడు భగవద్గీత బోధించేసరికి తక్కినవాళ్లంతా "అలాగే" అన్నట్లు తలాడించారు.

"బాగున్నావా ఈరమ్మా...? ఆ!... అన్నట్టు చెప్పడం మరిచాను. మన తరపున ఎమ్.ఎల్.ఏగా పోటీచేస్తున్న రాజారావ్‌గారు ఈయనే...!" ఈరమ్మకు పరిచయం చేసాడు ఆ ఊరి మునసబు.

"నమస్కారమమ్మా...!" రెండు చేతులు జోడించి వినయంగా నమస్కరించాడు రాజారావ్.

"అవును... మన పెద్దోడెక్కడికెళ్లాడు? " ఆ ఊరి (పెసిడెంట్ గారు అడిగారు.

"బడికని పట్నం వెళ్లాడయ్యా! కాసేపట్లో వచ్చేస్తాడు" ధైర్యం చేసి మొదటిసారిగా వారిముందు నోరు మెదిపింది ఈరమ్మ.

"(ప్రవీణ్ అనే కు(ర్రాడు వీరబ్బాయేనండి. అబ్బాయి చాలా బుద్ధిమంతుడు. బి.ఎ చదువుకుంటున్నాడు" ఇంకో పెద్దమనిషి ఈరమ్మకు నోరూరించేలా ఇంకా నాలుగు తియ్యటిమాటలు వల్లించాడు.

"ఏమిటీ...? పట్నంలో చదువుకుంటున్న (ప్రవీణ్ వీరి అబ్బాయా! మరి ఆ విషయం ఇంతవరకు నాకెందుకు చెప్పలేదు. ? ఇప్పటికైనా మించిపోయింది ఏమీలేదులే.. .! చూడమ్మా... మీ అబ్బాయి రాగానే మేము వచ్చిన సంగతి చెప్పు. అలాగే... బి.ఏ పూర్తయిన తర్వాత నన్ను కలవమని చెప్పు.

ఏదైనా ఉద్యోగం ఇప్పిస్తాను''. ఇలా ఎందరి దగ్గర ఆశలు రేకెత్తించాడో తెలియదుగానీ... ప్రవీణ్ ముక్కూ ముఖం చూడకున్నా నోటికి వచ్చిన నాలుగు ముక్కలు కూసేసరికి ఈరమ్మ మనసులో 'ఆశ' అనే కెరటం ఎగసిపడింది.

'అబ్బా...!' చెవులు చిట్లిపోయే ఆ వాగ్దానాల హోరును భరించలేక నిద్రాదేవి గూడా ఓబులేసు వడిని విడిచిపెట్టి దూరంగా పారిపోయింది. ఆవులిస్తూ కళ్ళు తెరిచిన ఓబులేసు... వెంటనే కంగారుపడ్తూ మంచం మీదినుంచి లేచి వినయంగా చేతులు కట్టుకొని నిలబడ్డాడు.

''ఏమిటయ్యగారు.... ఇలా వచ్చారేమిటి? కబురంపితే నేనే వచ్చేవాన్నిగదా!'' తన మొద్దు నిద్రను మనసులోనే తిట్టుకుంటూ తప్పుచేసినవాడిలా తలదించుకొన్నాడు ఓబులేసు. అక్కడ సైకిల్ గంట మ్రోగేసరికి అందరూ అటువైపుగా దృష్టిని కేంద్రీకరించారు. ప్రవీణ్ సైకిల్ దిగి స్టాండువేసి ఆ పెద్దమనుషులవంక తేరిపారచూస్తూ వచ్చి నులకమంచంపై కూలబడ్డాడు.


''అమ్మా! కాళ్లు కడుక్కోడానికి కాసిన్ని నీళ్ళు తీసుకురా!'' చేతిలో ఉన్న పుస్తకాలను ప్రక్కన పెడుతూ తల్లివైపు తిరిగి చెప్పాడు ప్రవీణ్.

''పెద్దవాళ్లంతా నిలబడి ఉంటే... నువ్వేమిటిరా మంచంపైన కూలబడ్డావ్...? లేయ్... లేచి నిలబడు''... ప్రవీణ్ వంక తిరిగి కన్నెర్రజేసాడు ఓబులేసు.

''ఎవరికి పెద్ద?... అయినా పెద్దతనం వయసుకుగాదు... మనసుకు ఇవ్వాలి. ఇంతకీ ఊరి పెద్దలంతా కలసి బజారున పడ్డారు. ఓట్లకోసమా? లేక చందాలకోసమా?'' వెటకారంగా అడిగాడు ప్రవీణ్.

''కాసేపు నువ్వు నోరుముయ్యరా....!'' ఈరమ్మ కొడుకును గదిమింది..

''అలా ఎంతసేపని నిలబడతారయ్యా.. ..!? కూసోండి'' మంచం విదిలించి తిరిగి దాన్ని అదేస్థానంలో ఉంచాడు ఓబులేసు.



''మన మంచాలపైన కూర్చుంటే... వారికి అంటరానితనం అంటుకుంటుందిలే నాన్నా!'' రాజారావ్ వంక చూస్తూ చిరుమందహాసం చేసాడు ప్రవీణ్. ఆ మాట విని ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు అక్కడున్న పెద్దలంతా.

''మిమ్మల్ని అంటరానివారని వేలెత్తి చూపేది ఎవరయ్యా...? కులమతాలనేవి మనం ఏర్పరచుకున్నవేగాని మనవెంట వచ్చినవా...? లేక మనం వెళుతూ తీసికెళ్లేవా...? కులాలు, మతాలు వేరైనా మనం కొలిచే దేవుళ్ళు ఎవరైనా... భగవంతుడు అనేవాడు ఒక్కడేనన్న సంగతి నీకు తెలియదా? నీది... నాది... మనందరిది ఒక్కటే కులమయ్యా! అదే మానవకులం. కులాలను నమ్ముకుంటే కూడుబెడతాయా? మతాలను నమ్ముకుంటే మన బ్రతుకులు బాగుపడతాయా? నువ్వు చదువుకున్నవాడివి. లోకజ్ఞానం తెలిసినవాడివి. నీకు నేను విడమర్చి అన్ని విషయాలు చెప్పనవసరం లేదనుకుంటాను. మామీద నీకంతగా నమ్మకంలేకపోతే... మీ తోపాటు మీ మంచాలమీద కూర్చుంటాం. మీతోబాటు మీ కంచాలలో భోజనం చేస్తాం. ...'' రాజారావ్ సుదీర్ఘమైన ఉపన్యాసం ఇచ్చాడు.

''మంచినీళ్లు కావాలాసార్...?'' ప్రక్కనున్న పెద్దాయన అడిగాడు.

''ఇంటికెళ్లిన తర్వాత సోడా తాగుతాన్లేవయ్యా...!'' భుజంమీదున్న కండవాతో ముఖానికి పట్టిన చెమట బిందువులను తుడుచుకుంటూ చెప్పాడు రాజారావ్.

''థాంక్యూ సార్! నాకు కులాల మతాల పేర్లు చెప్పి మనుషుల్ని వేరుచేసేవారంటే అయిష్టం. నా దృష్టిలో మనమందరం ఒక్కటే! మీరు మా మాటను గౌరవించిన ందుకుగాను మా ఓట్లన్నీ మీకే....!'' మన్మధ బాణాల్లాంటి ఆ పెద్ద మనుషుల మాటలు ప్రవీణ్ ఆవేశాన్ని అణచివేసి... అతని మనసులో ఆకర్షణను వెలిగించాయి. వారి చేతుల్లో. చెయ్యి కలిపిన ఆ మధుర క్షణాలు తలచుకొని ఉక్కిరిబిక్కిరి అయ్యాడు ప్రవీణ్. అంతటితో దేశం మొత్తంమీద కులమతాలు సమసిపోయి అందరూ ఒక్కటిగా బ్రతుకుబాటలో పయనిస్తున్నారనే పగటి కలలతో ఆ రోజంతా గడిపాడు అతడు.

* * *

''అరే భాయ్...! బడేలోగ్ ఆరహేహై... బజారుకు జాకర్ దస్ స్ట్రాంగ్ ఛాయ్ లావో...!'' నౌకరును కాఫీ తెమ్మంటూ పురమాయించాడు కరీంఖాన్.

''నమస్కారం కరీంఖాన్ భాయ్ ...!'' ప్రెసిడెంట్ గౌరవసూచనంగా విష్ చేశాడు

''నమస్తే... నమస్తే...! ఆయియే... ఆయియే... బైటో సాబ్... బైటో...!'' అతిధి మర్యాదలు చేసి అందరిని కుర్చీలమీద కూర్చుండబెట్టి తను కూడా ఒక కుర్చీలో కూర్చున్నాడు కరీంఖాన్.

''ఈ మధ్య అంతగా కనిపించడంలేదు... మీ వ్యాపారం బాగా జరుగుతుందా ఖాన్ బాయ్'' అడిగాడు ఒక పెద్ద మనిషి.

''అల్లా దయవల్ల బాగానే సాగుతుంది'' చెప్పాడు కరీంఖాన్.

"అన్నట్టు... ఖాన్ భాయ్ నీకీ విషయం తెలుసా?'' ఏదో రహస్యం చెబుతున్నట్టుగా ముందుకు వంగి మెల్లగా కరీంఖాన్ చెవిలో గొనిగాడు ఒక పెద్దమనిషి.

"ఏమిటి సాబ్...?''

"ఈ ఊర్లో ముస్లింలందరికి నాయకుడివి నువ్వే కదా...!?''

"ఇంకా మీకు అనుమానమా...!'' ముక్కుమీద కోపం ప్రదర్శించాడు కరీంఖాన్.

"మరీ అంత కోపం తెచ్చుకోకు భాయ్! నీ సంగతి మాకు తెలియదా! నిన్ను మేము అవమానిస్తే... మాకు మేమే అవమానించుకున్నట్టవుతుంది. ఇంకో పెద్ద మనిషి కరీంఖాన్‌ను కూల్ చేసాడు. అన్ని మతాల వారి మనస్తత్వాలు ఎలా ఉంటాయో తెలియదుగానీ ముస్లిం మతస్థుల్లో ఎక్కువ భాగం పొగడ్తలకు పొంగిపోతారు. ఉన్నరోజు పలావు, లేనిరోజు పచ్చడిమెతుకులు తినడానికికూడా వెనుకాడరు. అష్టకష్టాలు పడుతున్నా... ఆత్మాభిమానం మెండుగానే ఉంటుంది.


ఆ పెద్ద మనుషుల పొగడ్తలకు లొంగిపోయి గడ్డం సవరించుకున్నాడు కరీంఖాన్.

"ఇంతకీ... అసలు సంగతేమిటో చెప్పనే లేదు...''

"మన ఊరి రామాలయం మీ మసీదు దగ్గర్లోనే గదా ఉండేది.'' ఒకతను మెల్లిగా అసలు విషయం బయటపెట్టి మతోన్మాదము సృష్టించడానికి అడ్డదారి వెతుకుతున్నాడు. అది ఎందరి అమాయకుల ప్రాణాలు బలి తీసుకుంటుందో రాజకీయ నాయకులకు అనవసరం. వారికి కావలసింది ప్రజాక్షేమం గాదు... పదవి... పదవికోసం ప్రాణాలతో చెలగాటమాడే ప్రజాస్వామ్య దేశంగా భారతదేశం గుర్తించబడినందుకు మనం సిగ్గుతో తలవంచుకోవాల్సి వస్తుంది.

"అవును... అయితే...?'' అర్థంకాక (రాజకీయం) తలగోక్కున్నాడు ఖాన్.

"ఆ ఎగస్పార్టీ వాడు మిమ్మల్ని... మీ



## పోలీస్ స్టేషన్

గంగారాంకి చెప్పాడు కన్నయ్య—

"దొంగతనం చేసి వస్తుండగా ఆ ఇంట్లో వాళ్ళు నన్ను చూసి తరుముకుంటూ వచ్చారు.''

"తర్వాత?''

"అదృష్టవశాత్తు దగ్గర్లో ఓ పోలీస్ స్టేషన్ కనబడింది లోపల దూరాను.''

—పద్మశ్రీ (మాణిక్యారం)

మతాన్ని... మీ ఆచార వ్యవహార్నాల్నీ కూలదొయ్యటానికి ప్రయత్నిస్తున్నాడు ఖాన్ భాయ్! నిన్న మసీదు దగ్గర బాజాబజంత్రీలు ప్రయోగించవద్దయ్యా అంటే ఆ మాట చెప్పిన వాళ్ళ ముఖం పగులుతుంది. రక్తపాతం జరుగుతుంది అంటూ హెచ్చరించాడు. ఇంకా మా యిష్టం మాది. మాకు ఇష్టమైన చోట వాయించుకుంటాం. చెప్పడానికి మీరెవరు... అడగడానికి వారెవరు అంటూ నానాకూతలు కూసాడు. మేముగూడా హిందూమతానికి సంబంధించిన వారమైనా... మాకు మీ మతాలను, ఆచారాలను కించపరిచే ఉద్దేశం లేదు. మీరు మేము అంతా అన్నదమ్ములతో సమానం. అందుకే మేమే ముందుగా మీకీ విషయాన్ని చెప్పిపోదామని ఇలా వచ్చాం. తర్వాత మీ ఇష్టం... అన్నట్టు మీరు మా పార్టీ విజయానికి కృషి చెయ్యడం మాత్రం మరచిపోవద్దు! వస్తాం ఖాన్ భాయ్...!'' రగిలించాల్సిన మంటను రగిలించేసి మెల్లగా అక్కడనుంచి జారుకున్నారు వారు. ఎన్నో సంవత్సరాలనుండి తలపుకురాని ఆ విషయం ఈనాడు కొందరు రాజకీయ నాయకుల స్వార్థంవల్ల వెలుగులోకి వచ్చింది. మతంమీదున్న మూఢ నమ్మకాలతో కొందరు... మతాలను అడ్డం పెట్టుకొని దోచుకొనేవారు కొందరు ఉన్నట్లే... మతోన్మాదం సృష్టించి తమ అవసరాలు తీర్చుకునే కొందరు రాజకీయ ప్రబుద్ధులు కూడా మన దేశంలో ఉన్నారు. చెప్పుడు మాటలు చెవులను హోరెత్తించేసరికి కరీంఖాన్ మానవత్వం నశించింది. ప్రాణాలకన్నా మత రక్షణమిన్నయని భావించి కయ్యానికి కాలు దువ్వడానికి సంసిద్ధుడయ్యాడు కరీంఖాన్.

* * *

రామాలయంలోని గంట గణగణ మంటూ మ్రోగి ఆ ప్రదేశమంతా హోరెత్తించింది. 'ఎక్కడలేని భక్తి ఒక్కసారిగా పెల్లుబికి వచ్చేసరికి — ఆ భక్తి పారవశ్యానికి తట్టుకోలేక రాముడు కూడా గర్భగుడిని వదిలిపెట్టి బయటికి పరిగెత్తి ఉంటాడేమో!

''ఒరేయ్...! మన గుళ్ళో జరుగుతున్న పూజలు... పునస్కారాలు... భజనలు ఆపు చేయమని హెచ్చరించడానికి వారెవ్వర్రా? వారు చెప్పినట్లు మనం ఎందుకు వినాలి. వారికేనా పౌరుషం. మనకు లేదా? వారికేనా దేవుడు. మనకు లేడా? కాలికి తగిలిన ప్రతి రాయిని కొలుస్తామని మమ్మల్ని హేళన చేశారు వారు. అలాంటి వారిని ఊరకనే వదిలిపెట్టకూడదు. తాడోపేడో తేల్చుకోవలసిందే! మన ప్రాణాలు పోయినా ఫరవాలేదు... మన సాంప్రదాయాల్ని మనం కాపాడుకోవలసిందే. ''అవును... అవును...'' పిచ్చివాని చేతిలోవున్న రాయితో సమానం మూర్ఖుని చేతిలో ఉన్న అధికారం. ఆ అధికారంతో కొందరి అమాయక జీవితాల్ని బలితీసుకోవడానికి ప్రతిజ్ఞ బూనాడు వారి నాయకుడు. ఇక సమరం మొదలైంది.

రోజు రోజుకి రాజకీయ ఉచ్చు బిగుసుకోసాగింది. మతాలు వేరైనా... మనం కొలిచే భగవంతుడు ఒక్కడే అని మన పవిత్ర గ్రంథాలు ఘోషిస్తున్నా... వాటిని పట్టించుకొనే నాయకుడే కరువైయ్యాడు. రాజకీయ రణరంగంలో బలైపోయిన అమాయక సోదరుల శవాలమీద రాజ్యమేలడానికి

రాజకీయ నాయకులు ఉవ్విళ్ళూరుతున్నారు. దేశం మొత్తంమీద ఇలాంటి సంఘటనలు కోకొల్లలుగా జరిగాయి. కుల మతాలను రెచ్చగొట్టి మతాలను రూపుమాపుతామని మైకులు విరగొట్టి, డబ్బును వెదజల్లి, సారా నీళ్ళు పోసి... దౌర్జన్యంచేసి... రిగ్గింగ్ జరిపి ప్రాణాలతో చెలగాటమాడి... వీటిలో ఏ ఒక్కటి ఆచరించైతేనేమి... ఎన్నికలలో విజయం సాధించి మంత్రి పదవిని చేపట్టాడు రాజారావ్.

* * *

కాలానికి కళ్ళెం వేస్తే అది ఆగదు. అరచేతిని అడ్డుపెట్టి సూర్యశక్తిని ఎవరూ ఆపలేరు. అలాగే విద్యార్థుల్లో చైతన్యం రావాలేగాని... వచ్చిన తర్వాత దాన్ని ఆపడం ఎవరి తరం గాదు. అయితే నేటి సమాజంలో కొన్ని విద్యార్థి సంఘాలు కొన్ని రాజకీయ పార్టీల గుప్పెట్లో ఉన్నాయంటే అతిశయోక్తి గాదేమో! అవసరాలకు కొందరు... అవకాశాలకు కొందరు... సమాజంలో తమ పరపతిని... పలుకుబడిని పెంచుకోడానికి కొందరు ... ఇలా వారి వారి స్థితిగతులనుబట్టి... అవసరాలనుబట్టి విద్యార్థిలోకం రానురాను అధోగతి పాలవుతున్నది. చేసేది తప్పని తెలిసినా... రాజకీయానికి దాన్ని కప్పిపుచ్చే శక్తి ఉంది గనక దొంగలు కూడా దొరల్లా ఈ సమాజంలో చెలామణి అవుతున్నారు. ప్రజాపాలన చేపట్టిన నూతన ప్రభుత్వం ఓట్లకోసం ప్రజల్లో రేకెత్తించిన ఆశల వర్షం దెబ్బకు తడిసి మోపెడయింది. ప్రతిపక్షాలు ప్రజల సహాయంతో నూతన ప్రభుత్వంపై బురద చల్లడానికి ఇలాంటి అవకాశాలకోసం ఎదురు చూస్తాయి. వాదోపవాదాలనుండి... చొక్కా చొక్కా పట్టుకొని చించుకునే పరిస్థితి కూడా వచ్చింది మన పవిత్రమైన ప్రజాస్వామ్యంలో! వర్గ నాయకుల వత్తిడి వల్లనో ... కొన్ని వర్గాల అభ్యర్థన మేరకో... ప్రభుత్వంపై ప్రజల్లో సానుభూతి పెంపొందించుకోనేందుకో... ఎలా అయితేనేం రిజర్వేషన్‌లు పెంచడం జరిగింది. దీని గురించి ముందుగా పెద్దగా ఎవరూ పట్టించుకోకపోవడం అందరూ గమనించాల్సిన విషయం.

## గ్లామర్



'శ్రీదేవితో నన్నెందుకు పోల్చుకుని చూస్తారో నాకు అర్థం కాదు. మేం ఇద్దరం హీరోయిన్స్‌మే అయినా తను వేరు, నేను వేరు. నటన విషయంలో నా పద్ధతి వేరు, నా తీరు వేరు.

నాకు తెలుసు... నేను నెంబర్ వన్ స్థానానికి చేరుకోలేదని. అయితే నాలో ప్రతిభ లేక కాదు. నేను గ్లామర్‌కి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వలేదు.

హిందీ సినిమా రంగంలో గ్లామర్‌కి ఎక్కువ ఇంపార్టెన్స్ అని నాకు తెలీదు. నా దృష్టిలో గ్లామర్ అంటే అర్ధనగ్నంగా బట్టలు ధరించడం కాదు.

దేవుడు ఇచ్చిన సహజమైన అందమే నిజమైన గ్లామర్' అంటోంది జయప్రద.

—వింజమూరి కృష్ణమూర్తి

కాని... చెప్పుడు మాటలవల్ల కొందరు... సూత్రధారుల సహాయ సహకారాలవల్ల కొందరు... ప్రతిభకు స్థానం కల్పించాలంటూ కొందరు.. ఇలా ... ఊరు... వాడ... జిల్లా... రాష్ట్రం... చివరికి దేశం మొత్తంమీద రిజర్వేషన్ ఉద్యమం (వ్యతిరేక) ప్రారంభమై... అది చిలికి చిలికి గాలివానగా మారినట్లు ఆత్మాహుతుల దగ్గరికి వచ్చేసరికి ఉద్యమం కాస్త తీవ్రరూపు దాల్చింది. కొత్త ప్రభుత్వం యొక్క చరిత్ర ఆరునెలల పాలనతోనే అర్ధాంతరన్యంగా ముగియబోతుందని కొన్ని రాజకీయపార్టీలు జ్యోతిష్యం కూడా చెప్పాయి. ఈ ఉద్యమం వెనుక కొన్ని రాజకీయ హస్తాలు ఉన్నాయనే వాదన కూడా అక్కడక్కడ వినపడసాగింది. ఇందులో అసలు విశేషం ఏమిటయ్యా అంటే... రిజర్వేషన్‌లకు మద్దతుగా గూడా ఆందోళన జరపడమే... పులిని చూసి నక్క వాత పెట్టుకోవడం అంటే ఇదే కాబోలు.

* * *

చూడ ముచ్చటైన అద్దాల మేడ అది. చుట్టూ ఉన్న రకరకాల పూల మొక్కలు దాని అందాన్ని మరికాస్త పెంచడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాయి. ఆ మేడలోకి అడుగుపెట్టిన ప్రతి ఒక్కరికి "ఇది మయసభను మించిపోతున్నదే."

అన్న భ్రమ కలగక మానదు. అలాంటి సుందర సువిశాలమైన భవనంలో ఏకాకిగా కూర్చొని మందు పుచ్చుకుంటున్నాడు భుజంగరావు. భుజంగరావ్ అంటే ఎవరోగాదు ... మొన్నటి ఎలక్షన్లలో రాజారావ్ మీద పోటీచేసి ఓడిపోయిన ఒకప్పటి మాజీ మంత్రి, రాజకీయ నాయకులు పరువుపోయినా బాధపడరుగాని... పదవిపోతే మాత్రం తెగ బాధపడిపోతారు. ఆ బాధను మరచిపోవడానికి ముందు కొడతారు.

"సార్..." ఎవరో పిలిచేసరికి చిన్నగా తలెత్తి అతని వంక చూసాడు భుజంగరావు.

"మీరు చెప్పినట్టుగా ఈ పట్టణమంతా చుట్టొచ్చాను సార్...! ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరూ ఆందోళన జరపడంలేదు....'' చేతులు కట్టుకుని నిలబడి వినయంగా చెప్పాడతడు. చేతిలో ఉన్న గ్లాసువైపు భుజంగారావు పెదవులు ఆశగా చూస్తున్నాయి. వెంటనే దానిలో ఉన్న మందుతో గొంతు తడుపుకొని గట్టిగా తల విదిల్చాడు భుజంగరావ్.

"అంటే....?" కళ్ళెగ్రజేసి అడిగాడు.


"రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా .కొన్ని విద్యార్థి సంఘాలు ర్యాలీని నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అలాగే అనుకూలంగా కూడా ర్యాలీని నిర్వహించేసి చేతులు దులుపుకున్నాయి సార్ మరికొన్ని విద్యార్థి సంఘాలు". తను కష్టపడి మోసుకొచ్చిన వార్తలను భుజంగరావ్ చెవుల్లో చేరవేసాడు అతడు.

"దేశం మొత్తం రిజర్వేషన్ల తాకిడిని తట్టుకోలేక విలవిలలాడి పోతున్నా... ఆ ప్రభావం ఇక్కడ కాస్తయినా కనిపించకపోవడం నిజంగా ... నిజంగానే ఆశ్చర్యం కలిగిస్తుందయ్యా... నాకు ప్రజల్లో మనం తిరిగి సానుభూతి సంపాదించాలంటే... ముందు పాలిస్తున్న ప్రభుత్వంపైన ప్రజలకు

ఏవగింపు కలిగేలా చేయాలి. దేశంలో కల్లోలం సృష్టించాలి. దానిని అణచడానికి ప్రభుత్వం కష్టపడాలి. అది ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమని మనం ప్రజలకు చాటి చెప్పాలి. అప్పుడేనయ్యా ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం సన్నగిలి మనపై విశ్వాసం పెరిగేది! పత్రికల్లో మన పేరు మారుమ్రోగేది! రాజకీయంలో గెలుపు ఎంత సహజమో... ఓటమి గూడా అంతే సహజం. కాదనను... కాని... వాటిని సమానంగా ఆదరించి మిన్నకుండి పోవడం రాజకీయ లక్షణంగాదు. ఏమి చేసైనా... తిరిగి పదవిని చేపట్టడమే రాజకీయం! ఇదంతా త్వరలో నీకే తెలుస్తుంది... ముందు నవ్వు మన విద్యార్థి సంఘాలను సమావేశపరచు... వాటిని చక్కదిద్దక చాలా రోజులైంది. ..'' సుదీర్ఘమైన ఉపన్యాసం ఇచ్చేసరికి దాహం వేసింది భుజంగరావ్‌కు. అందుకే టీపాయ్ మీదున్న మందుగ్లాసును చేతిలోకి తీసుకొని పెదవులు తడుపుకున్నాడు భుజంగరావ్.

* * *

మొట్టమొదటిసారిగా ఆ పట్టణంలో రగిలిన రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం సంచలనం రేకెత్తించింది. పధ్నాలుగు గంటలపాటు స్ట్రయిక్‌ను నిర్వహించి పూర్తిగా ప్రజాజీవనాన్ని స్తంభింపజేసారు విద్యార్థులు. బలవంతాన షాపులు మూయించారు. రాకపోకలకు అంతరాయం కలిగించారు. ప్రభుత్వ వాహనాలకు నిప్పు అంటించారు. ప్రభుత్వ అసమర్థతను చాటిచెప్పే పదజాలంతో వీధులవెంట ఊరేగింపు జరిపారు. ప్రభుత్వ ఆఫీసుల్లోని ఫైళ్లను తగలబెట్టారు. ఎదురు తిరిగినవారిని అవతలికి ఏరిపారేసారు. రిజర్వేషన్లు ఎత్తివేయాలంటూ కలెక్టర్‌కు, సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఆ మరుసటిరోజే తిరిగి కొన్ని విద్యార్థి సంఘాలు రిజర్వేషన్‌కు మద్దతుగా స్ట్రయిక్‌ను నిర్వహించారు. కొన్నిచోట్ల వ్యతి



రేకవర్గానికి, అనుకూల వర్గానికి మధ్య ఘర్షణలు కూడా జరిగాయి. కాని వాటిని గూర్చి ఆలోచించే సహనం ఎవరికి ఉంది...?

* * *

"నమస్తే సార్....!"

"నమస్తే... నమస్తే....! కూర్చోండి... ." భుజంగరావ్ సోఫా మీద కూర్చుంటూ తన కెదురుగా ఉన్న సోఫాను చూపించేసరికి ... అప్పటివరకు అక్కడ పడిగాపులుగాసిన విద్యార్థులంతా సోఫాలమీద చతికలబడి ఊపిరి పీల్చుకున్నారు.

"నాకు పదవిలేకపోయినా ఫరవాలేదుగానీ... ప్రజాక్షేమం పట్టించుకోకుంటే నా మనసు తట్టుకోలేదయ్యా...! చెప్పండి...? ఏమిటి మీ సమస్యలు...?" తాపీగా అడిగాడు భుజంగారావ్.

"మేము రెండురోజులనుంచీ స్ట్రయిక్ నిర్వహిస్తున్నా... మా సమస్యలు ప్రభుత్వాధికారుల దృష్టికి తీసుకొని వచ్చినా... ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది సార్....!" ఒక విద్యార్థి నాయకుడు తన మానసిక వ్యధను బయటపెట్టాడు.

"ఏమిటి...? మీరు... మీరు... రెండు రోజులనుంచి స్ట్రయిక్ నిర్వహిస్తున్నారా...? ఆ సంగతే నాకు తెలియదు సుమా...! ఇంతకీ స్ట్రయిక్ నిర్వహించి ఏమి ఘనకార్యాలు చేసారు...?" పెద్దగా నవ్వి... ఆతర్వాత మెల్లిగా అసలు విషయం కదిలించాడు భుజంగరావ్.

"షాపులు మూయించాం. ఊరేగింపులు జరిపించాం. సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి మా కోర్కెలను ప్రభుత్వాధికారుల దృష్టికి తీసుకొనివచ్చాం..." గొప్పగా ఇంకేదో చెప్పబోయాడు మరొక విద్యార్థి.

"శాంతియుతంగా స్ట్రయిక్ నిర్వహిస్తే... సమస్యలు పరిష్కారమవుతాయా...! లేక మీ విషయాలు ప్రభుత్వం పట్టించుకుంటుందా...! అదే నాలుగు బస్సులను... మూడు ప్రభుత్వ ఆఫీసులను... తగలబెట్టారనుకో... . పేపర్లో ఆ వార్త ఫ్రంట్ పేజీలో పడుతుంది. అదిచూసి ప్రభుత్వం జడుసుకొని మీ కాళ్ల దగ్గరకి వస్తుంది... అదీ స్ట్రయిక్ అంటే...!" మధ్యలో అందుకొని మాటకాస్త పూర్తి చేసాడు భుజంగరావ్.

"అలాగా సార్...!" ఆశ్చర్యంగా అడిగాడు ఒక విద్యార్థి.

"అది గూడా నేనే చెప్పాలా...! ఆ మాత్రం తెలుసుకోలేకపోతే... మీలాంటివాళ్లు స్ట్రయిక్లు ఎలా చెయ్యగలరయ్యా!" రాజకీయ ఉపదేశం వల్లించాడు భుజంగరావ్. తన సహాయ సహకారాలు కూడా ఉంటాయని హామీ కూడా ఇచ్చాడు. ఇక చెప్పవలసిన పనేముంది... అగ్ని దేవునికి గాలి దేవుడు తోడైనట్టు జరగరాని సంఘటనలెన్నో జరిగిపోయి.... పేపర్లలో ప్రముఖంగా ప్రచురించబడ్డాయి ఆ విషయాలు.

* * *

ముచ్చటగా మూడవ రోజుకూడా స్ట్రయిక్ మొదలైంది. రెక్కాడితేకాని డొక్కాడని కష్టజీవుల గోడు ఏ ఒక్క నాయకుడు పట్టించుకోలేదు. ఇక వ్యాపారస్తుల బాధలు

వర్ణనాతీతం. చాటుమాటు తిట్లు ఎన్ని తిట్టినా ఏం లాభం? కూడు గుడ్డకు రాని మాటలవల్ల పెదవికి చేటేగాని పొట్ట గడవదు. తల్లిదండ్రులు సంపాదించిన సొమ్ముతో సిగరెట్లు ముట్టించే హీనస్థితికి దిగజారిన విద్యార్థి లోకం గురించి ఇంకా ఎంత చెప్పినా చెవిటివాని దగ్గర శంఖం ఊదినట్లే అవుతుంది. ప్రతిభకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలి. అది అడగవలసిన మాటే...! కాని కొందరి స్వార్థానికి మన జీవితాల్ని ఎందుకు బలిచేసుకోవాలి. చదువుకున్నవారు ఆ మాత్రం ఆలోచించలేరా! అండదండలు ఉన్నాయని ఆదమరచి ప్రవర్తిస్తే... జరిగే నష్టం ఎవరికి? మనకా...? లేక... మనల్ని ప్రేరేపించిన పెద్దవారికా...? విజ్ఞానంతో విరజిల్లాల్సిన విద్యార్థి లోకం... ఈ మధ్య అజ్ఞానంతో తనకు తానే వెన్నుపోటు పొడుచుకుంటోంది. దీనికి పరిష్కారం ఒక్కటే! ప్రతి విద్యార్థి తనకు తానుగా ఆలోచించుకోవాలి. కొందరి చెడు స్నేహంవల్ల... నిజం తెలియకపోవడంవల్ల గూడా ప్రతిభ ఉన్న విద్యార్థులు కూడా నేడు అధోగతి పాలవుతున్నారు. ఆరోజు స్ట్రయిక్‌లో ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు విద్యార్థులు. ఆవేశం కొందరిది... అవకాశం మరికొందరిది. ఆలోచన ఇంకొందరిది. ఇందులో ఎక్కువగా నష్టపోయేవారు ఆవేశమున్న అమాయకులే! వారిని ముందుకు నెట్టి తాము మాత్రం వెనుక ఉంటారు ఆలోచనాపరులు. కష్టపడి సంపాదించిన సొమ్ముతో కడుపు నింపుకొని... కాలేజీకొచ్చి కాలరెగరేసినంత మాత్రాన సరిపోతుందా! స్ట్రయిక్‌లంటూ గొంతు చించుకొని అరచినంతమాత్రాన మీ తల్లిదండ్రుల కష్టాలు తీరతాయా!

"ఒరేయ్...! ఎవడ్రావాడు? ఇంకా షాపు తెరిచే ఉన్నాడు... పగలగొట్టండిరా దాన్ని..." అంతే... వరుసగా పదిరాళ్లు ఆ షాపువైపు దూసుకెళ్లాయి. కేవలం... ఒక్క... ఒకే ఒక్క మాటతో కొన్ని వేల రూపాయల వస్తువులు నేలమట్టమయ్యాయి.



## సంతోషం

"బస్‌లో పిల్లలకి టిక్కెట్లు తీసుకోరు కదా?" అడిగింది అరవై ఏళ్ళ బామ్మ కండక్టర్‌ని.

"పన్నెండు లోపైతే తీస్కోరండీ" చెప్పాడు కండక్టర్.

"మంచిది నాయనా; నాకు పదకొండు మందేలే" చెప్పింది బామ్మ సంతోషంగా.

—ఎం.రమణారెడ్డి (నందికొట్కూర్)

కన్నీళ్లు పెట్టడం తప్పితే... ఆ షాపువాడు తన కడుపుమంటను ఎవరితో చెప్పుకోగలడు.

"ఒరేయ్....! బస్సు వస్తుంది... అందులో ఉన్న ప్రయాణికుల్ని దించేసి పెట్రోల్ పోసి తగలబెట్టండి....'' అవకాశవాదుల మాటలు తు.చ తప్పకుండా పాటించార ఆవేశపరులు.

"ఎవ్వడ్రా అక్కడ...?'' ఒక విద్యార్థి గుంపు అటుగా వెళ్ళింది. ఆ గుంపును చూడగానే ఒక ముసలావిడ గుటకలు మింగింది.

"ఏమి చేస్తున్నావ్ ఇక్కడ...?'' కఠినంగా ప్రశ్నించింది ఒక కంఠం.

"కూరగాయలు అమ్ముకుంటున్నాను బాబు...! పచ్చి సరుకు... రెండు రోజులనుంచి అమ్మకంలేక కూరగాయలు కొన్ని కుళ్ళిపోతున్నాయి... మరికొన్ని వాడి పోతున్నాయి. ఇవి అమ్ముకుంటేగాని నా పొట్ట గడవదు...'' దీనంగా వేడుకుంటూ ఇంకేదో చెప్పబోయింది ఆవిడ. కాని ఆ ముసలావిడ మాటలు అక్కడున్న ఎవరికి రుచించలేదు.

"ఎన్నిసార్లే నీకు చెప్పేది...?'' ఒకడు ఆమె కూరగాయల గంప తీసుకొని రోడ్డుమీద విసిరికొట్టాడు. అలాంటి తల్లుల బిడ్డలు అక్కడ చాలా మంది ఉన్నారు. అయినా ఏమి లాభం... ఏ ఒక్కరు అది తప్పని చెప్పిన పాపాన పోలేదు. అలా చెబితే తమ పరువు ఎక్కడ పోతుందోనని... భయం పాపం.

"ఇలా ఎన్ని చేసినా ఏమి లాభం ఉండదురా...! ఏదో ఒక థ్రిల్ చేస్తేగాని... మనమంటే ఏమిటో... అప్పుడుగాని అందరికి అర్థంగాదు...''విద్యార్థి నాయకుడు చెప్పగానే అందరూ ఆలోచనల్లో మునిగిపోయారు.. ఆ థ్రిల్ ఎలా ఉండాలా... అని, అంతలో అటువైపుగా ఒక రిక్షా వేగంగా దూసుకొచ్చింది...

"రేయ్... ఆపరా రిక్షా...! నీకు ప్రత్యేకంగా పిలిచి చెప్పాలా...!'' వేగంగా వెళుతున్న రిక్షాను ఆపి... ఆ రిక్షా వాడి చెంప పగలగొట్టాడు ఒక విద్యార్థి.

"నేను కావాల్సి రిక్షా వెయ్యలేదయ్యా...! పాపం పిల్లవాడికి ప్రాణంమీదికి వచ్చి... ఆ తల్లి కడుపు తరుక్కోపోయేలా ఏడుస్తుంటే... కాదనలేక వచ్చాను... ఈ ఒక్క తప్పు మన్నించండయ్యా. వీరిని ఆసుపత్రిలో వదిలిపెట్టి... ఇక రిక్షాను రోడ్డుమీదకే తీసుకురాను'' కళ్ళనుండి చెంపలపైకి జారుతున్న వెచ్చటి కన్నీటి చుక్కలను తుండుగుడ్డతో తుడుచుకుంటూ ప్రాధేయపడ్డాడు ఆ రిక్షావాడు. "తమను విడిచిపెట్టి పుణ్యం కట్టుకోండి బాబు'' అన్నట్టుగా చేతులెత్తి నమస్కరించింది ఆ రిక్షాలో వున్న ఒక తల్లి మనసు.

"ఏమిట్రా...? మా దగ్గరే డ్రామాలాడుతున్నావా...? ఇంకొకడు తను చదువుకున్న విజ్ఞానాన్ని సమాధిచేసి... తను పెంచి పోషించిన అజ్ఞానాన్ని ఆ రిక్షావాడిమీద ప్రదర్శించాడు. చదువుకున్న వారి మూర్ఖత్వం కంటే... చదువులేనివాడి అమాయకత్వం ఎన్నో రెట్లు మిన్న అనేది దీనినిబట్టి మనకు అర్థమైంది. దౌర్జన్యంతో ఆ రిక్షావా

డికి బుద్ధి చెప్పి... అందులో కూర్చొని ఉన్న ఒక తల్లి హృదయాన్ని నడిరోడ్డు మీద నిలబెట్టి... ఆరిపోతున్న ఒక పసి హృదయాన్ని ఆమె చేతుల్లో పెట్టి... అక్కడి నుంచి కదిలారు మన భావిభారత పౌరులు. స్ట్రయిక్ అంటే ఇదేనేమో స్వేచ్ఛ అంటే ఇంతేనేమో! హక్కులు అంటే ఇవేనేమో, వీరిని చూసి భరతమాత బాధపడుతుందో..

భయపడుతుందో... లేక తన బిడ్డలని తలచి అక్కున చేర్చుకుని ఆదరిస్తుందో...! వేచి చూడవలసిందే మరి.

"బాబు...! నన్ను విడిచి వెళ్ళిపోయావా నాన్నా....!" పుత్రద శోకంతో రోడ్డుమీద కూలబడి విలపిస్తున్న ఆ తల్లి హృదయాన్ని ఆదుకొని ఆదరించి సానుభూతి చూపేవారు ఎవరు...?

"ఒరేయ్...! మన గురించి ఎడిటోరియల్ లో తప్పుగారాసిన ఆ పత్రిక ఆఫీసును ధ్వంసం చేద్దాం పదండి..."

"అవున్రా...! మనమే వారిని వేరు చేస్తున్నామంటా! మళ్ళీ ఇప్పుడు రిజర్వేషన్లు రద్దు చెయ్యమంటున్నామంటా! అలా చేస్తే అన్ని కులాల వారిని సమానంగా ఆదరించాలంటూ...! అంటూ ఇంకా ఏవేవో పిచ్చి రాతలు రాసారు... ఆ పత్రిక ప్రజల్లోకి పోకముందే ఆ కాపీలను తగలబెట్టేద్దాం పదండి...."

ఒకరు చెప్పేమాట మరొకరికి వేదవాక్కుగా మారసాగింది. ఏది మంచో...ఏది చెడో ఆలోచించే పరిస్థితిలో లేదు ఇప్పటి విద్యార్థిలోకం. అందుకే ఎవరికివారు యమునాతీరే అన్నట్లుగా ఉంది నేటి దుస్థితి. అనుకున్న పనిని అరగంటలోపూర్తి చేసారు వారు. ఇక తన్నడానికి తగలేయడానికి ఏమి మిగలేదు వారికి. ఇక మిగిలిందల్లా ఒక్కటే. ..! ఆత్మాహుతి!" ప్రజల్లో — ప్రభుత్వంలో అలజడి తీసుకురావాలంటే అదొక్కటే మంచి ఉపాయం" అన్న రాజకీయ సూక్తి చాలా బాగా పనిచేసింది వారినరనరాల్లో!

## జీ సాబ్



సక్సెస్ ఒక్కోసారి మనిషినీ... మాట తీరునీ, ప్రవర్తననీ మార్చేస్తుంది అనడానికి చక్కని ఉదాహరణ నిర్మాత, దర్శకుడు కె.సి. బొకాడియా.

పరిశ్రమలో పలువురి చేత మంచివాడు, నెమ్మదస్తుడు, సౌమ్యుడు అనిపించుకున్న బొకాడియాని మొదటిసారిగా మీనాక్షిశేషాద్రి 'పోలీస్ ఔర్ ముజ్రిమ్' సెట్స్‌మీద కలిసినప్పుడు ఎంతో గౌరవంగా 'మిమ్మల్ని నేను ఎలా పిలవాలి.. కెసిజీ అనా, బొకాడియా జీ అనా' అని అడిగింది.

'బొకాడియా సాహెబ్ అని పిలు' అని ఎంతో సీరియస్‌గా చెప్పాడు కెసిబి.

ఇదంతా ఆజ్ కా అర్జున్ హిట్ మహాత్యం.

—వింజమూరి కృష్ణమూర్తి

కాని ఎవరు ఆత్మాహుతి చేసుకోవాలి? నువ్వా..? నేనా...? నీవా....? ఎవరు...? ఎవరు...? ఈ ప్రశ్నకు సమాధానం అంతత్వరగా చిక్కలేదు. ఎదుట వాని ప్రాణం పోయినా ఫరవాలేదు గాని... మన ప్రాణాలు మాత్రం బద్రంగానేఉండాలన్నది మన ఆచారం, అందుకే చాలా సేపు ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చారు వారంతా! కిరోసిన్ వంటిమీదపోసుకొని తగలబెట్టుకోవాలి! దానికి ధైర్యం కావాలి. అలాంటివాడి కోసం గాలించి చివరకు పట్టుకొని బలవంతానో... బయపెట్టో... బాధపెట్లో.. అతన్ని సజీవదహనం చేసారు. (కాని కొందరు మాత్రం తమకు తామే బలి అయిపోయారు. అలాంటివారికి ఈ కథ అంకితం) మరుసటిరోజు ఏ పత్రికలో చూసిన ఈ వార్తలే...! నిజాలు ఎవరికి కావాలి? నీడను చూసి భయపడే రోజులు ఇవి. అందుకే అంతా సస్పెన్స్!

* * *

''సార్...!''

ఏమిటన్నట్లు తలెత్తి ప్యూన్ వంక చూసాడు ఎడిటర్.

''మీ కోసం ఎవరో వచ్చారు''.

''రమ్మని చెప్పు...'' కాసేపు మౌనం వహించిన తర్వాత చెప్పాడు ఎడిటర్. ప్యూన్ బయటికి పోయినకొద్ది సేపటికి నలుగురు యువకులు ఎడిటర్ రూమ్‌లోకి ప్రవేశించారు.

వారి ముఖంలో ఆనందానికి బదులు ఆందోళన. ఆలోచనకు బదులు ఆవేశం ఉన్నట్లుచూడగానే తెలుసుకున్నాడు ఎడిటర్

''కూర్చోండి...'' కుర్చీలు చూపిస్తూ చెప్పాడు.

''మేము కూర్చోడానికి రాలేదు... మీతో ఒకమాటచెప్పిపోదామని వచ్చాం...?'' ఒక యువకుడు విసురుగా చెప్పాడు.

''దేని గురించి...?''

''రేపు స్ట్రయిక్ చేస్తున్నాం...'' గాంభీరంగా చెప్పాడొకడు.

''ఆ విషయం మీ పేపర్లో ప్రకటించండి ...'' ఇంకొకడు చెప్పాడు.

''ముందుగా ప్రకటిస్తే... ప్రజలు కాస్త జాగ్రత్తపడతారు గదా...! అందుకని...'' తనకుతాను సమర్థించుకున్నాడు ఇంకొకడు.

''మూడు రోజులనుంచి స్ట్రయిక్‌లు జరుగుతూనే ఉన్నాయి గదా...!

...ఇంతకీ మీది అనుకూలమా...? ప్రతికూలమా...? ... అవును... మిమ్మల్ని ఎక్కడో చూసినట్టు గుర్తు... బహుశ కాలేజి వార్షికోత్సవంలో అనుకుంటాను... ఆ రోజుమీరు కులమతాలు సమానమంటూ చాలాబాగా ఉపన్యసించారు... ధ్యాంక్స్...!'' చెప్పాడు ఎడిటర్. ఆ మాట అతని నోటినుంచి రాగానే ప్రవీణ్ నోరు మెదపలేక పోయాడు.

''నాకు తెలుసునయ్యా...! మొన్న అన్నికులాలు మతాలు సమానమంటూ తెగవాగిన నువ్వే... ఈ రోజు ప్రభుత్వం వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు పెంచితే.. దాన్ని వెంటనే అమలు పరచాలని ఆందోళన లేవదీస్తున్నావ్! అంటే... నువ్వే నేను అంటరానివాడినని ఒప్పుకుంటున్నావా...?


అసలు మిమ్మల్ని కాదయ్యా అనాల్సింది. అంటరానితనం నేరమంటూనే వారివి రిజర్వేషన్ల పేరుపెట్టి వేరు చేస్తున్నారే.. వారిని... ఆ ప్రభుత్వాన్ని అనాలి, తమ రాజకీయ స్వార్థంకోసం ఎర్పరచినవేనయ్యా ఈ రిజర్వేషన్లు, మీ మీద అభిమానంతో గాదు. వారి మీద ద్వేషంతో గాదు. వీరి కోసం వారు వారి కోసం వీరు చేస్తున్నది ఏమి లేదు. అంతా వారి స్వార్థం కోసమేనని ఇప్పటికైనా తెలుసుకోండి...

మీ స్ట్రయికులవల్ల బాధ పడేది సామాన్య ప్రజలేగాని... బడా—బడా నాయకులుగాదు. ఆ సామాన్యులలో మీ తల్లిదండ్రులుగూడా కొందరు ఉంటారు. కాబట్టి నా మాటవిని ఇప్పటికైనా మీ ఉద్యమాలు ఆపి సమాజ శ్రేయస్సు కోసం వర్గ బేధంలేకుండా సమైఖ్యంగా పోరాడితే... సాధించలేనిదంటూ ఏది లేదు... ఆ తర్వాత మీ ఇష్టం...'' ఎడిటర్ చెప్పగానే వారిలో ఏ ఒక్కరు నోరు మెదపకుండా మౌనంగా బయటికినడిచారు.

* * *

''సార్! మీరు రగిలించిన, చిచ్చు మధ్యలోనేఆరిపోయింది. విద్యార్థుల్లో ఆవేశం తగ్గి ఉద్యమాలు మూలనపడ్డాయి. ఇక మీ గతి... మాట పూర్తి చేయబోయి మౌనం వహించాడతడు. వెంటనే భుజంగరావ్ భుజాలు ఎగరేస్తూ పెద్దగా నవ్వాడు.

''ఒరేయ్...! ప్రజలు గొర్రెలతో సమానంరా! ఒక్కరిని మనవైపు తిప్పుకుంటే... అందరూ తలలొంచి మనకాళ్ళ దగ్గరికి వస్తారు. మనం తిరిగి ప్రజల్లో సానుభూతి సంపాదించాలంటే... కులమతాలను పావులుగా చేసుకొని చదరంగం (రాజకీయ) ఆడాల్సిందే! వారిని రెచ్చగొడితే ఏమి జరుగుతుందో రేపటినుంచి నువ్వే చూస్తావ్ గదా!'' భుజంగరావ్ చెప్పినట్లే... మరుసటి రోజు నుంచి పాదయాత్ర మొదలుపెట్టి ప్రజల్లో కల్లోలం సృష్టించాడు. మతాలపేరు చెప్పికొన్ని మతాల సానుభూతిని సంపాదిం



చాడు. మతాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేసి మతోన్మాదానికి పాల్పడుతున్నందుకు ప్రభుత్వం భుజంగరావ్‌ను అరెస్టు చేసింది. ఇదే అదనుగాభావించి కొన్ని రాజకీయశక్తులు ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించడానికి మారణహోమం సృష్టించారు. జరిగిన వాస్తవం అందరికీ తెలుసు. తెలిసి గూడా ప్రజలు తప్పుదోవలో నడుస్తున్నారనడానికి ఇదే ఉదాహరణ, భుజంగరావ్ మనుషులు ''భారత్ బంద్'' పేరిట నరబలి మొదలు పెట్టారు. అతని పేరు పత్రికల్లో మారు మోగసాగింది. ఇంకెందరి ప్రాణాలు ఈ రాజకీయాస్త్రానికి బలౌతాయో... కాలమే చెప్పాలి. లేక ప్రజలు నిజం తెలుసుకొని ఆ రాజకీయాస్త్రాన్ని తునాతునకలు చేస్తారో...! కొన్ని రోజులు వేచి చూడవలసిందే! *

